ఆటోవాలాకు ఏదీ భరోసా?

కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆటోవాలాలకు ఠంచన్‌గా ఏటా రూ.10 వేలు అందేది. దీంతో పాటు వడ్డీ రాయితీ, బీమా వంటివి అందేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని సైతం విస్మరించడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు.

- ఎన్నికల హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్
- గతంలో అండగా నిలిచిన వైఎస్ జగన్


కొండాపురం సెంటర్‌లో ఉన్న ఆటోలు

కొండాపురం : ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో సుమారు 600 వరకు ఆటోలు ఉన్నాయి. బస్సులు లేని సమయంలో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. నియోజకవర్గంలో బస్సు సౌకర్యాలు లేని గ్రామాలు చాలా ఉన్నాయి. దీంతో ప్రజలు ఆటోలపైనే ఆధారపడి గ్రామాలకు వెళ్లాలి.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచుతూ ఉండడంతో ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99, పెట్రోలు రూ.110 వరకు ఉంది. దీంతో రోజంతా కష్టపడితే రూ.300 నుంచి రూ.400 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. వీటితో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు నిర్వహించి రూ.వేల జరిమానా విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బులు ఇంధనం, ఇతర ఖర్చులకే పోతున్నాయని వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో భరోసా

ఎన్నికల హామీ మేరకు గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అర్హులైన ఆటో, ట్యాక్సీ, మాక్సీక్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున ఏటా వారి ఖాతాల్లో జమ చేసి ఆదుకున్నారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబసభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేశారు. అలాగే వాహన కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ.3 లక్షల వరకు వడ్డీ రాయితీ అందించారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

కష్టాల్లో ఉన్న తమను ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటో కార్మికులు వాపోతున్నారు. ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయడం లేదని మండిపడుతున్నారు. ఆటో కార్మికులను ఆదుకునే విషయం గురించి కూడా ఆలోచించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ అలాంటి ఊసే లేదని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీ నెరవేర్చిన జగనన్న



ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆటో డ్రైవర్లను గుర్తించిన నాయకుడు ఎవరూ లేరు. ఎన్నికల ముందు పాదయాత్రలో మా సమస్యలను గుర్తించి అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఏటా రూ.10 వేలు అందించి ఆదుకున్నారు.

– గాలింకి శివ, ఆటో డ్రైవర్, రేణమాల

రూ.15 వేలు ఇవ్వాల్సిందే



రోజంతా కష్టపడి ఆటో తోలినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పు చేసి ఆటో కొనుగోలు చేసి వాటికి ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం, రోడ్డు ట్యాక్స్ కట్టుకోలేక ఆటోలను నడపలేకపోతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున ఇవ్వాలి.

– దార్ల రాంకుమార్, మర్రిగుంట, ఆటోడ్రైవర్

సంగంలో ఉచిత వైద్య శిబిరం



సంగం : సంగం మండల కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక జగన్ ప్రాథమిక చికిత్స కేంద్రం, కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాదాల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాదాల వెంకటతరుణ్ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం వైద్యులు వెంకట తరుణ్, దుగ్గిబోయిన వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు సత్తార్, ఆత్మకూరు డివిజన్ కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, మహేష్, బాలకృష్ణ, పెంచలలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

16 రోజుల వేడుక నేడు

ఉదయగిరి : పట్టణంలోని సుద్దబావి వీధిలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సీతారాముల 16 రోజుల పర్వదిన వేడుకను చేస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా స్వామివార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహించి 16 రోజులు పూర్తయిన సందర్భంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వామివార్లను పూలంగి సేవ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..


వైఎస్ జగన్‌తో రామిరెడ్డి

కావలి : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బెంగళూరులోని ఆయన నివాసంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మర్రిపాడు : మండలంలోని ఇర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ చారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి పాల్గొని, మాట్లాడారు. ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎంపీపీ గంగవరపు లక్ష్మిదేవి, ఎస్సై శ్రీనివాసులు, హెచ్‌ఎం బ్రహ్మయ్య, సర్పంచ్ గుర్రం శ్రీనివాసులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూరు : తీవ్ర వేసవి నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి బైపాస్ సెంటర్ వద్ద తాగునీటి చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. వైఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఆధ్వర్యంలో జనసేన కార్యవర్గ సభ్యుల సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు వెంకట ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జేపీ ప్రసాద్, లక్ష్మీశెట్టి మాధవ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


బైబిల్ సందేశాన్ని వినిపిస్తున్న చర్చి ఫాదర్ సునీల్‌కుమార్

సీతారామపురం : మండలంలోని సీతారామపురం, మారంరెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, సోంపల్లి, సింగారెడ్డిపల్లి, నెమళ్లదిన్నె, చిన్నాగంపల్లి, సంజీవరెడ్డినగర్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల విచారణ గురువులు మాట్లాడుతూ ఏసు క్రీస్తు మరణాన్ని పొంది మానవాళి పాపాలను క్షమించడానికి భూమిపై మళ్లీ అవతరించారన్నారు. ప్రతిఒక్కరూ ఏసు చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో చేజర్ల విద్యార్థి ప్రతిభ


మణిదీప్‌రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు(చేజర్ల) : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చేజర్లకు చెందిన వాకా మణిదీప్‌రెడ్డి 3,800 (దివ్యాంగుల కోటాలో) ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చేసిన మణిదీప్‌రెడ్డి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపల్ సుకుమార్ ఆకాంక్షించారు. ఈ మేరకు విద్యార్థిని ఆదివారం అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం

ఆత్మకూరురూరల్ : మండలంలోని నువ్వూరుపాడు ఎంపీటీసీ గడ్డం సుచిత్ర భర్త, వైఎస్సార్‌సీపీ నేత గడ్డం విజయభాస్కర్‌రెడ్డి అనారోగ్య కారణాలతో ఆదివారం మరణించారు. ఈ క్రమంలో పార్టీ నేతలు ఆయన మృతికి సంతాపం తెలిపారు. జంగాలపల్లిలో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. సోదరుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


మర్రిపాడులో ప్రచారం చేస్తున్న సభ్యులు


ఆత్మకూరురూరల్ : బొటికర్లపాడులో..

సంగం : మండలంలోని మర్రిపాడు, జంగాలకండ్రిక, వంగల్లు, ఎస్వీఆర్ పురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ నెల్లూరు అధ్యక్షుడు, సభ్యులు డి.సురమౌళి, కోటేశ్వరరావు, శ్రీదేవి, రాజేంద్రప్రసాద్, నారాయణమ్మ, రామయ్య, కొండమ్మ, రఘురామయ్య, సుమలత, పద్మావతి, ప్రవీణ, రమ, మౌళి, సునీల్, వసుంధర పాల్గొన్నారు.

- ఆత్మకూరురూరల్ : మండలంలోని బొటికర్లపాడు, పడకండ్ల, యర్రబల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుత్తలూరుకు చెందిన ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మహాభారత కాలంలో తాను ఆచరించి ప్రవచించిన భగవద్గీత త్రైత సిద్ధాంతానికి ఆయువుపట్టుగా ఉందన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు సుధాకర్, మాలకొండారెడ్డి, నరసింహులు, మహేంద్ర, వెంకట సుబ్బమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సంబరాలు


కలిగిరి మండల కేంద్రంలో..


వింజమూరులో..

కలిగిరి : ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ రావడం పట్ల కలిగిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తలు ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఉదయగిరి(వింజమూరు) : ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మండలంలోని తక్కెళ్లపాడులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న సమస్య పరిష్కారమయ్యేందుకు మంద కృష్ణ చేసిన కృషిని పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్, పెద్దయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు


వింజమూరులో సీసీరోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేష్

కలిగిరి : గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. వెలగపాడు పంచాయతీలో రూ.44 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు బీవీ రామారావు, గన్నమనేని శ్రీనివాసులునాయుడు, చిట్టిబోయిన ప్రసాద్, సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

- ఉదయగిరి(వింజమూరు) : ఉదయగిరి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 75 అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం ప్రారంభించారు. తొలుత వింజమూరులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని, అనంతరం సీసీరోడ్లను ప్రారంభించారు. జలదంకి, కలిగిరి, వింజమూరు, ఉదయగిరి మండలాల్లో జరిగిన సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


బాణసంచా తయారీ కేంద్రాల వద్ద సూచనలు చేస్తున్న సిబ్బంది


అగ్నిమాపక సిబ్బందికి సన్మానం

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చివరి రోజు బాణసంచా తయారీ కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తల గురించి సిబ్బందికి వివరించి కరపత్రాలను అందజేశారు. సాయంత్రం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసయ్య, ప్రభాకర్, సుధాకర్‌రావు, రమేష్, రత్నం, గౌస్‌బాషా, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళలపై ఉచిత తరగతులు

ఉదయగిరి : చిత్రకళల మీద ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల సందర్భంగా ఉచిత చిత్రకళా తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు వై.సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 86397 40303 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మే నెలలో ప్రతి గురు, శుక్రవారాల్లో ఉచిత చిత్రకళా తరగతులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

23లోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

సీతారామపురం : మండలంలోని రేషన్ కార్డుదారులు ఈనెల 23వ తేదీలోపు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేయని వారి జాబితా ఆయా గ్రామాల్లోని రేషన్ షాపుల డీలర్ల వద్ద అందుబాటులో ఉందని, కార్డుదారులు వాటిని గమనించి ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు.

మేకపాటి ఆశీర్వాదం


వరుడు శ్రీకాంత్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కందులవారిపాళెంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మునగాల తిరుమలరెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి వివాహ వేడుకల్లో పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. వరుడిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌కు గిన్నిస్ రికార్డు



కోవూరు: మండలంలోని పడుగుపాడులో నివాసముంటున్న మేకనూరి శ్యామ్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును దక్కించుకున్నారు. విజయవాడలో గతేడాది డిసెంబర్ ఒకటిన నిర్వహించిన అంతర్జాతీయ ఈవెంట్‌కు ఆయన హాజరయ్యారు. ఎనిమిది దేశాల నుంచి వచ్చిన 1046 మంది ఇందులో భాగస్వాములు కాగా, గంట పాటు కీ బోర్డును వాయించి వీడియోలను పోస్ట్ చేశారు. ఈ క్రమంలో గిన్నిస్ రికార్డుకు ప్రతినిధులు ఎంపిక చేశారు. ఈ తరుణంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు మెడల్, సర్టిఫికెట్‌ను పాస్టర్ అగస్టిన్ దండంగి అందజేశారు.

కామాక్షితాయి సేవలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని విజయవాడ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ సిబ్బంది సత్కరించి.. శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు(ఫైల్)

కావలి : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు (75) ఆదివారం గుండెపోటుతో మరణించారు. ఆరోగ్యం ఇబ్బందిగా ఉండటంతో ఉదయం 6 గంటలకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరగా, గుండెపోటుతో కాలం చేశారు. ఈ క్రమంలో కావలి పట్టణంలోని వాయునందన ప్రెస్ వీధిలో ఉన్న ఆయన నివాసంలో భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన రూరల్ మండలం సర్వాయపాళెంలో సోమవారం అంత్యక్రియలు జరుగుతాయి. కాగా దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు మరణానికి చింతిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకట నారాయణలు నివాళులర్పించారు. కాగా దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు పట్టణంలో డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించారు. ఆయన భార్య శాంతమ్మ కావలి రూరల్ జెడ్పీటీసీగా, ఎంపీపీగా, సోదరుడు పూర్ణచంద్రరావు రూరల్ ఎంపీపీగా సేవలు అందించారు. ఆయన కుమారుడు సుధీర్‌నాయుడు వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

వైఎస్ జగన్ పరామర్శ

దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు అకాల మృతితో ఆయన కుమారుడు సుధీర్‌నాయుడుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


ఎల్‌ఆర్‌పల్లి గిరిజన కాలనీలో ప్రభుత్వ పాఠశాలల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు : తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, వారి ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పడాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవాస ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల గురించి ఆదివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. సమీపంలోని గిరిజనకాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యాల గురించి వివరించి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.గంగాధర్, శివప్రసాద్, మురళీకృష్ణ, మస్తాన్ షరీఫ్, ఖాదర్‌బాషా, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరి మారాలి


సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేలా చట్ట సవరణ చేసిందని, దానిని వెంటనే రద్దు చేయాలని, కార్మికుల పట్ల కేంద్రం వైఖరి మార్చుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణంలో సీఐటీయూ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరికి నిరసనగా మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తీర్మానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బాధ్యులు కె.హజరత్తయ్య, డేవిడ్‌రాజు, మహమ్మద్ అలీ, రమేష్, యూటీఎఫ్ నాయకులు హరికృష్ణ, శివప్రసాద్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల, హెల్త్, విద్యుత్ యూనియన్ నాయకులు రాధమ్మ, రమణమ్మ, జిలానీ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పుట్టినరోజు వేడుకలు


వేదపండితులకు సంభావన నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ఆనం, అధికారులు

ఆత్మకూరు : సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్సార్‌జేడీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా సీఎం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయుష్మ హోమం చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వేదవిద్యను పూర్తిచేసిన వేద పండితులకు రూ.3 వేల చొప్పున గడిచిన మూడు నెలలకు కలిపి అందజేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 599 మంది నిరుద్యోగ వేదపండితులకు మొత్తం రూ.53.91 లక్షలు అందజేసినట్లు మంత్రి ఆనం తెలిపారు. ఎనిమిది వేల మంది పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, శ్రీకాళహస్తి ఆలయ ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.